# యండమూరి వీరేంద్రనాథ్

# ప్రియురాలు పిలిచె



ప్రేమంటే, మనం లేనప్పుడు కూడా అవతలి వ్యక్తి మన గురించే అనుక్షణం ఆలోచిస్తూ వుంటారన్న నమ్మకం.

- అనూజ్ఞ

---

"అతన్ని ఎడారి మధ్యలో వదిలిపెట్టి రండి. నా మీద ప్రాక్టికల్ జోకు వేసినందుకు అదే అతనికి శిక్ష."

- శ్రీ కల్యాణి

---

"నన్ను బాధ పెట్టడం నీకు సంతోషాన్నిస్తుందంటే – ఆ బాధని కూడా సంతోషంగా అనుభవిస్తాను"

- కార్తికేయ

---

మొదటిసారి ఒంటరిగా చదివినా,

రెండోసారి జంటగా కూర్చుని

చదవాలనిపించే అద్భుత కథనం......

# యండమూరి వీరేంద్రనాథ్

విరచించిన వినూత్న వీణారవళి

# ప్రియురాలు పిలిచె

# ప్రియురాలు పిలిచె

యండమూరి వీరేంద్రనాథ్

PRIYURALU PILICHE
By :
YANDAMOORI VEERENDRANATH
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
HYDERABAD – 500 034
Ph. 924 650 2662
yandamoori@hotmail.com
yandamoori.com

SARASWATHI VIDYA PEETAM,
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G.Dist. (A.P.)

Publishers :
NAVASAHITHI BOOK HOUSE
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
E-mail : navasahithiravi@gmail.com

This book is digitized and brought to you by KINIGE

© Author
© Yandamoori Veerendranath

This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# ప్రియురాలు పిలిచె

**ఉత్తరమంటే** శృతి చేసిన వీణలా, ప్రతి అక్షరం మనసుని మీటాలట. బ్రతుకు తీగెమీద మీద జ్ఞాపకం సరిగమలు వాయిస్తోంటే, నేనొక గాఢమైన అలౌకికానందంలో మునిగిపోయి, ఇదిగో ఇనాళ్ళకు తేరుకుని ఉత్తరం వ్రాయటం మొదలుపెట్టాను.

అప్పుడే రంగులద్దిన తడి తైలవర్ణ చిత్రంలా వుంటుంది మీ జ్ఞాపకం. సెలయేరు పెదవి విప్పినట్లు, అలవోకగా పుప్పొడి రాలినట్లు వుంటుంది మీతో గడిపిన సాయంత్రం.

ప్రేమంటే ఘనీభవించిన ఒక అసంతృప్తి అనుకుంటా. సూర్యోదయాలూ, చంద్రదర్శనాలు, శశిర జీర్ణపత్రాలు, విషాదంలో ఆనందం, ఆనందంలో విషాదం; వెన్నెల్ని కప్పే నల్లమబ్బు, చీకటికి ధవళవర్ణాన్ని ఆపాదించే మంచు తెర – ప్రేమంటేనే ఒక కాంట్రడిక్షన్ కదూ!

ప్రతి కథా ఏదో ఒక పాయింట్ ఆఫ్ టైమ్‌లో ప్రారంభం అవుతుందట. మరి మీ మీద నా ప్రేమ ఎప్పుడు ప్రారంభం అయిందో? తన అక్షరాల్లోకి తానే వెళ్ళి వెతుక్కునే రచయితలా, నేనూ వెళ్ళి శోధించాలి. బదులు తెలియని ప్రశ్నలకి సమాధానం కావాలంటే కాలం తలుపు తట్టాల్సిందే. కానీ ఎంతకాలం ఇలా? ఇక నేనాగలేను. వెన్నెల్లో కరిగిపోయిన ఆడపిల్ల ఆఖరి ఉత్తరానికి, కంటి చివర జాలు వారిన ఆఖరి నీటి చుక్క కూడా ఆవిరైపోయింది.

గాలి గాలిగానే వుంటుంది – వేణువునుంచి రాగమై రవళించే దాకా! నీరు నీరుగానే వుంటుంది – ఇంద్రధనుస్సు చివరి రంగుగా విరిసేదాకా! మాట, అనుభవం, జీవితం ఇలానే వుంటాయి – అల్కెమీ తెలిసిన మీలాటి మనిషి తీవెల్ని శృతి చేసేదాకా!!

ఏ దయార్థ్ర పవన గీతికా నయనమో చెమ్మగిల్లి, మనం కలుసుకునే అవకాశం కల్పించటం లేదు. ఏ శీతల చంద్రికా కిరణ హృదయమో కరిగి మన సంయోగాన్ని వాస్తవం చేయటం లేదు.

రేపు మధ్యాహ్నం ఫ్లయిట్‌లో నేనొస్తున్నాను.

తాజ్ ఇంటర్నేషనల్‌లో నా పేర్న రూమ్ బుక్ అయివుంది.

రాగానే ఫోన్ చేస్తాను. ఫోన్ చేసిన అరగంటలో మీరు నా దగ్గర వుండాలి.

మీర్రాకపోతే –

సరీగ్గా అరగంట తరువాత ఆత్మహత్య చేసుకుంటాను.

- మీ.....

అనూజ్ఞ

.......

# అధ్యాయం - 1

**వర్షం వెలిసి** దాదాపు గంట అయింది. కొబ్బరాకు మీద నిలిచిన వాన చినుకు, వదల్లేక వదల్లేక ప్రియుడిని వదిలి పెడుతున్న ప్రియురాలిలా వీడ్కోలు చెప్పి నేలకు జారింది. మబ్బు పరదా చాటునుంచి వెన్నెల కుంచెని బయటకు తీసిన చంద్రుడు ఆ బిల్డింగ్ తాలూకు అరిస్టోక్రసీని రెట్టింపు చేసే ప్రయత్నంలో వున్నాడు.

బయట అందాల్ని పట్టించుకోకుండా శ్రీకళ్యాణి, చేతిలోని ఫైల్‌ని తీక్షణంగా చదువుతూ వుంది. మానేజ్‌మెంట్ అకౌంటెన్సీ ఆకర్షించినంతగా ఆమెని ప్రకృతి ఆకట్టుకోలేదు. మనిషికీ మనిషికీ మధ్య బంధం అనేది పరస్పర అవసరాల కోసం వ్యక్తులు ఏర్పర్చుకునే లౌక్యపు ముడి – అని ఆమె గాఢంగా నమ్ముతుంది. ఆమె క్రింద జనరల్ మానేజర్స్ నుంచి వర్కర్ల వరకూ దాదాపు రెండు వేల మంది వివిధ కంపెనీల్లో పనిచేస్తూ వుంటారు. కళ్యాణి గ్రూప్ తాలూకు పరిశ్రమల్లో ఉద్యోగం దొరకటం, అక్కడ పని చేయటం అదృష్టంగా భావిస్తారు చాలామంది. శ్రీ కళ్యాణి కాట్‌మిల్స్ షేరు పది రూపాయల్ది నూటయాభై పలుకుతోంది.

కళ్యాణి తండ్రి ఆమె అయిదో ఏట పోయాడు. ఆయన కోటీశ్వరుడు. తల్లి ఆ తరువాత అయిదు సంవత్సరాలకు పోయింది. కళ్యాణి ఆస్తి అంతటికి ఆమె మేనమామ గార్డియన్ అయి ఆమెని పెంచి పెద్ద చేశాడు. ఆమెకి పది సంవత్సరాల వయసులో మేనమామకి పక్షవాత మొచ్చింది. ఎనిమిది సంవత్సరాలు మంచం

మీదే వుండి మరణించాడు. అప్పటికి శ్రీ కళ్యాణికి పద్దెనిమిదేళ్ళు. మరణించేరోజే మేనమామ ఆమెని పిల్చి "అమ్మా, నా అంతం సమీపించింది. (ఆయన దైవ భక్తుడు. భాష కూడా అలాగే వుండేది.) నీ తండ్రి నీకిచ్చిన ఆస్తిని అలానే నీ కప్పగించి వెళ్ళిపోతున్నాను. అదొక్కటే నా సంతృప్తి. సత్యాన్ని (సత్యం అంటే ఆయన కొడుకు ) పెళ్ళి చేసుకో అమ్మా" అన్నాడు.

ఆమె కనుసైగతో డాక్టర్లు, నౌఖర్లు బయటకు వెళ్ళారు. ఆమె అన్నది, "మావయ్యా! ఇంకొంచెం సేపట్లో నువ్వు కోమాలోకి వెళ్ళిపోతావు. ఆ తరువాత మరణిస్తావు. ఈ చివరి క్షణాల్లో ఒక నిజం చెపుతావా?"

"ఏమిటమ్మా అది?"

"నా వయసు అయిదేళ్ళప్పుడు నేనో దృశ్యం చూశాను. నేను చూసిన ఆ దృశ్యం నిజమా కాదా అన్నది ఇన్ని సంవత్సరాలలో నేను తేల్చుకోలేక పోయాను. అది చెప్పగలిగేది నువ్వే మావయ్యా! చెపుతావా?"

"ఏమిటది?"

"ఒక గదిలో మంచం మీద ఒక మధ్య వయస్కుడు పడుకుని వున్నాడు. మరో వ్యక్తి అతడి మొహం మీద తలదిండు గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. గింజుకుని మంచం మీద మనిషి చనిపోయాడు....." అని ఆమె ఆగి "అయిదు సంవత్సరాల వయసులో నేను చూసిన ఆ దృశ్యం నిజమేనా మావయ్యా?" అంది.

ఆమె మేనమామ చాలా సేపు మాట్లాడలేదు.

"మరణించే ముందైనా నిజం చెప్పు మావయ్యా. అబద్ధం చెప్పి నన్ను నమ్మించటానికి ప్రయత్నించకు."

ఆయన కళ్ళు పై కెత్తి నెమ్మదిగా అన్నాడు, 'నీ తండ్రిని చంపింది నేనేనమ్మా!'

పిడికిళ్ళు మూసుకుని, ఆవేశాన్ని అణుచుకుంటూ ఆమె అలాగే వుండిపోయింది. ఆయన అన్నాడు. "నన్ను క్షమించు తల్లీ. నేనూ, నా కుటుంబం బికారుల్లా వచ్చి మీ పంచన చేరాం. మీ నాన్నని చంపేసి ఆస్తి నేను స్వంతం చేసుకోవాలనుకున్నాను. కానీ, దేవుడు నాకు బుద్ధి చెప్పాడమ్మా. ఎనిమిది సంవత్సరాలు పక్షవాతంతో మంచాన పడేశాడు. నా భార్యని తీసుకెళ్ళిపోయాడు. స్వామీ సచ్చిదానంద తీర్థుల వారి సాక్షిగా చెపుతున్నానమ్మా. అందుకే ఆస్తంతా నీ పేర తిరగ వ్రాశాను. నా కొడుకు సత్యానికి ఏమీ మిగుల్చుకోలేదు. ఇప్పుడు నా మనస్సు నిశ్చింతగా వుంది. ఈ విషయం కూడా నీకు చెప్పేసినందుకు మరింత తేలికైంది. ఎనిమిది సంవత్సరాలు పక్షవాతంతోనూ, పశ్చాత్తాపంతోనూ బాధపడ్డాను తల్లీ."

సగం నిజానికి, సగం అబద్ధానికి కూడా తన మంచితనం అద్ది, అవతలి వాళ్ళను నమ్మించగలనన్న నమ్మకంతో మరణిస్తోన్న అతడి వైపు సూటిగా చూసింది. ఆమె చూపులు గునపాలై అతడి గుండె లోతుల్లోంచి నిజాన్ని తవ్వుతున్నాయి. "ఆస్తంతా నా పేరు మీద మార్చి ఎంతకాలం అయింది మావయ్యా?" కామ్‌గా అడిగింది.

"గత సంవత్సరమే కళ్యాణీ!"

"మరి ఎనిమిది సంవత్సరాల్నుంచీ పశ్చాత్తాపపడుతున్నవాడివి, గత సంవత్సరం వరకూ ఎందుకాగావు?"

ఆయన జవాబు చెప్పలేదు. తిరిగి ఆమె అన్నది – "నువ్వు చేసిన పాపం వల్లనే నీకు పక్షవాతం వచ్చిందనీ, ఆ పాప పరిహారం చేసుకుని దేముడికి లక్షపత్ర పూజ చేయిస్తే కాలూ చేయీ స్వాధీనంలోకి వస్తాయని రెండు సంవత్సరాల క్రితం స్వామి సచ్చిదానంద తీర్థుల వారు నీకు చెప్పారు. అవునా?"

ఆయనలో జీవకళ తగ్గింది. "ఇది నీకెలా తెలిసిందో గానీ నిజం తల్లీ. ఆ పశ్చాత్తాపంతోనే ఆస్తి నీ పేరున తిరగ వ్రాశాను. ఇప్పుడు నా పాపం పరిహారమైంది. స్వర్గం నన్ను పిలుస్తూంది."

"చావు మరో పది క్షణాల్లో వున్నా కూడా నువ్వు మళ్ళీ ఆత్మవంచన చేసుకుంటున్నావు మావయ్యా! స్వామివారు చెప్పిన వెంటనే నువ్వు ఆస్తి నా పేరున వ్రాయలేదు. అంత ఆస్తి వదులుకోవడం నీకు కష్టమే కదా! మరో సంవత్సరం పాటు డాక్టర్ల చుట్టూ తిరిగి, ఫలితం లేదని తెలుసుకున్నావు. ఈ లోపులో స్వామివారు ప్రతి రోజూ నీలో పాప భీతి పెంచారు. నిన్ను భయపెట్టారు."

"ఇది... ఇదంతా.... నీ...కె.....లా... తెలిసింది?"

ఆమె ముందుకు వంగి, లోతైన గొంతుతో అంది....... "దేముడి భయం నీలో ప్రవేశ పెట్టి, నా ఆస్తి నాకు తిరగ వ్రాయిస్తే లక్ష రూపాయలు ఇస్తానని శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానంద తీర్థస్వాముల వారికి ఆశ పెట్టింది నేనే. స్వామివారు కూడా నీలాగే డబ్బుకి అతీతులు కారు మావయ్యా."

ఆయన అలానే చూస్తున్నాడు. కన్నార్పలేదు. ప్రాణం ఎప్పుడు పోయిందో తెలీదు. పక్షవాతం వల్ల పోయిందో, తన మేనకోడలు పద్ధెనిమిదేళ్ళ వయసులోనే

చూపించిన ఈ అపురూపమైన తెలివితేటల్ని చూసి కలిగిన షాక్ వల్ల పోయిందో గాని, మొత్తం మీద పోయింది.......

అంత చిన్న పిల్ల ఒక్కసారి కోట్ల ఆస్తికి తిరిగి వారసురాలు కావటంతో చాలామంది తోక జాడించాలని చూశారు. కార్మికుల సమ్మె నుంచి, జనరల్ మేనేజర్ల లంచగొండితనం వరకూ వ్యవహారాన్నంతా ఆమె ఒక సంత్సరంలో కొలిక్కి తెచ్చింది. అలా తీసుకురావటానికి ఆమెకు సహాయపడిన ఒకే ఒక గుణం – ఎవర్నీ 'నమ్మకపోవటం'.

సిగ్మా డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ ఏజెన్సీ వారికి ఆమె ప్రతి సంవత్సరమూ దాదాపు అయిదు లక్షల రూపాయలు ఫీజుగా చెల్లిస్తుంది. వారి పనల్లా, ఆమె వివిధ కంపెనీల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వారి మీద నిఘా వుంచి, వారి బ్యాంకు అకౌంట్లు, వారి టెలిఫోన్ ట్యాపింగులు, వారి రహస్య జీవితం, అన్నీ ఆమెకు ఎప్పటికప్పుడు తెలియజేయటమే. ఎంతో రహస్యంగా కొన్ని సంవత్సరాల్నుంచీ ఈ రిపోర్టింగ్ జరుగుతూ వస్తూంది. ఒకో పారిశ్రామిక వేత్తకి అంతకన్నా మరేం జాగ్రత్త కావాలి?

ఇరవై నాలుగేళ్ళు వచ్చేసరికల్లా శ్రీకళ్యాణి, మూర్తీభవించిన 'ఆయాన్ రాండ్' నవలల్లో పాత్రలా, I AM O.K. ,YOU ARE NOT O.K. సైకాలజీతో సరియైన నిర్ణయాలు సరి అయిన టైమ్‌లో తీసుకునే మేధస్సు అలవర్చుకుంది. ఆమె మావయ్య హయాంలో కోటి కోటిగానే వుండింది. ఆమె అయిదు సంవత్సరాల్లో దాన్ని మూడు రెట్లు చేసింది. అందుకే ఆమెకి సిరి కళ్యాణి అన్న పేరు సార్ధకమైంది.

మావయ్య పోయిన ఆర్నెల్లకి ఆమె ఒక రోజు సత్యంతో అన్నది. 'బావా ఈ రోజు మనం డిన్నర్ కి వెళ్తున్నాం'.

సత్యం ఆశ్చర్యంగా "నాతో డిన్నరా. నువ్వు నాతో గంట గడపబోతున్నావంటే చాలా ముఖ్యమైన పని అయ్యుండాలి అది" అన్నాడు.

ఆమె నవ్వి "ఒక రకంగా అదేలే-" అంది. నగరంలో కెల్లా ఖరీదైన రెస్టారెంట్ ఎనిమిదో అంతస్తు రూఫ్ గార్డెన్‌లో కూర్చున్నారు ఇద్దరూ. మేనేజర్ ఆమెకి వినమ్రతగా సెల్యూట్ చేసి తప్పుకున్నాడు. పది నిమిషాల్లో డిన్నర్ వచ్చింది. సూప్ తాగుతూ ఆమె సరాసరి విషయంలోకి దిగింది. "బావా! ఆర్నెల్ల క్రితం నేను నీ ఆస్తికి వారసురాలినయ్యాను. అప్పటివరకూ 'ఈ ఆస్తంతా నాది' అని నువ్వు అనుకొంటూ వుండొచ్చు. మావయ్య పోతూ ఆస్తంతా నా పేరు మీద వ్రాశాడు."

"అదేమిటి కళ్యాణీ ? అంతకు ముందు కూడా ఆస్తి మీ నాన్నదేగా" అన్నాడు సత్యం.

"అలా అని చెప్పి, మళ్ళీ నాకు ఇవ్వాలని లేదుగా సర్లే. ఎందుకు ఇచ్చాడో అదంతా ఇప్పుడు అప్రస్తుతం. ఇప్పుడు నీ గురించి చెప్పు. ఆస్తి పోయిందని బాధపడుతున్నావా?"

"అబ్బే, అటువంటిదేమీ లేదు."

"లేదనుకోవటం ఆత్మ వంచన."

"నిజంగానే అటువంటిదేమీ లేదు కళ్యాణి. నాకు అలాంటి అభిప్రాయమే వుంటే నిన్ను నా దానిగా చేసుకునే ప్రయత్నమే చేసే వాడినిగా. నువ్వు కాదంటే

అది వేరే సంగతనుకో. కానీ, ఇన్నాళ్ళల్లో ఎప్పుడైనా నీ దగ్గర చౌకబారుగా ప్రవర్తించానా? ప్రేమ పాఠాలు చెప్పానా?"

"నీ ప్రవర్తనకి 'మంచి' అన్న సర్టిఫికేట్టు ఇవ్వటానికి నాకేమీ అభ్యంతరం లేదు గానీ, నువ్వు నన్ను చేసుకోకపోవటానికి కారణం మాత్రం అది కాదు" అంటూ నవ్వింది.

"మరి?".

"నువ్వు ఈ పాటికే వేరే అమ్మాయి ప్రేమలో నిండా మునిగి వుండటం."

అతడు షాక్ తిన్నట్టు దిగ్భ్రాంతితో ఆమె వైపు చూశాడు. "నీకు తెలియని విషయమంటూ ఏమీ లేదా కళ్యాణీ?"

"ఆ విషయం వదిలేసెయ్. అసలు విషయానికి వద్దాం. నాకున్న ఏకైక బంధువ్వి నువ్వు. శ్రీ ఏజెన్సీ నీ పేరు మీద వ్రాయమంటే వ్రాస్తాను. దాదాపు పది లక్షల రూపాయలు చేస్తుంది అది."

" 'లా' చదివానే తప్ప, ఆ తలనొప్పి వ్యవహారాలన్నీ నేను పడలేను కళ్యాణి."

"మరేం చేస్తావ్?"

"నీ లీగల్ వ్యవహారాలన్నీ చూస్తాను. నాకా సామర్ధ్యం వున్నదనే అనుకుంటున్నాను."

"సరే అయితే-" డిన్నర్ ముగిస్తూ లేచింది. ఆ మరుసటి రోజు అతడిని నెలకు ఇరవై వేల రూపాయల జీతం మీద లీగల్ అడ్వైజర్‌గా నియమిస్తూ ఆర్డర్ యిచ్చింది. అదీగాక మెయిన్ రోడ్డుమీద వున్న షాపింగ్ కాంప్లెక్సు, దాదాపు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1623**

* * *

**Read other books of Yandamoori Veerendranath @**

http://kinige.com/kbrowse.php?via=author&id=355